## (హైదరాబాద్‌లో శ్రీ నాన్నగారి ప్రవచనము, 22-10-97)

జీవితంలో భౌతికంగాకాని, ఆధ్యాత్మికంగా కాని ఏది సాధించాలన్నా ఏకాగ్రత అవసరం. మన హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు కాని మనకు ఏకాగ్రత లేకపోతే భగవదనుభవం మనకి చిక్కదు. ఎన్ని శాస్త్రములు చదివినప్పటికి మనమనస్సు పరిశుద్ధం కాకపోతే, బుద్ధి నిర్మలం అవ్వకపోతే ఎన్నిజన్మలు ఎత్తినా విషయాలలో ఉన్న దోషాలు మనకు తెలియవు. మనస్సుకు ఏకాగ్రత వస్తే, పవిత్రతవస్తే విషయాలలో ఉన్నదోషాలు మనస్సుకు తెలుస్తాయి. అప్పడు ఆదోషాల నుండి విడుదల పొందాలనే సద్బుద్ధిని ఈశ్వరుడు మనకు ప్రసాదిస్తాడు. అఖండమైన ఆత్మకు దేహం అక్కరలేదు. మన మనస్సుకు దేహం కావాలి. తత్వం అర్ధమయ్యేవరకు ఈదేహము, లోకము, ఇంద్రియాలు అన్నీ నిజమే అని మనకు అనిపిస్తుంది. ఈదేహము, మనస్సు అహంకారము అన్నీ కల్పితమే. ఈకల్పిత విషయాలు కూడా తిరిగి వేలాది జన్మలు ఖర్చు పెట్టాము అని తత్వం తెలిసినవాడికి తెలుస్తుంది. ధ్యానం వలన ఏకాగ్రత వస్తుంది, నిష్కామకర్మవలన మనిషి పరమపవిత్రుడు అవుతాడు. ఈశ్వరుడు ఎంత పవిత్రుడో జీవుడికి అంతపవిత్రత చేకూరితేనే గాని ఈశ్వరస్వరూపాన్ని పొందలేడు. మనం చివరి వరకు జాగ్రత్తగా ఉండాలి. నీకు రోగం వచ్చింది అనుకో. కష్టపడి మందులువాడి తగ్గించుకొన్నావు అనుకో, ఇంకా కొంచెం రోగం మిగిలి ఉంది అనుకో నీవు అశ్రద్ధ చేస్తే ఆకొంచెం రోగం భవిష్యత్ లో పెద్దరోగంగా విజృంభించవచ్చు. రోగకారణం నిశ్శేషంగా నశించాలి. అలాగే నీలో ఉన్న అజ్ఞానం బీజంతో సహా నశించే వరకూ నీవు జాగ్రత్తగా ప్రయత్నంచేయాలి.

ఆత్మను తెలుసుకో, దానికి చావులేదు. దానిని తెలుసుకొంటే నీవుకూడా చావులేనిస్థితికి వచ్చేస్తావు అని మనపెద్దలు, శాస్త్రములు చెపుతున్నాయి. తెలుసుకో, తెలుసుకో అంటే అది ఎక్కడో బయట ఉంది అని వెతకటం ప్రారంభిస్తున్నాము. ఇక్కడే పొరపాటు పడుతున్నాము. ఆత్మ అంటే మనమే కాని అది మనకంటే వేరుగా ఉంది అనుకొంటున్నాము. మనస్సుతో దానిని తెలుసుకోలేముగాని మనస్సు అణిగినచోట అది వ్యక్తమవుతుంది. మనోమూలం తెలిసినవాడిని, తత్వం తెలిసిన వాడిని చూసినపుడు దేవతలకు కూడా అసూయ కలుగుతుంది ఆస్థితి అట్టిది. రోగం వచ్చింది అనుకోండి రోగం తగ్గాలి, తగ్గాలి అంటే అదిపోదు, రోగం తగ్గటానికి మందులు వేసుకోవాలి. అలాగే నీలో అజ్ఞానం ఉంది అదిపోవాలి, పోవాలి అంటే పోదు జ్ఞానం సంపాదిస్తే అజ్ఞానము నశిస్తుంది. మహాత్ములను, గురువులను ఆశ్రయించటం ఎందుకంటే జ్ఞానం సంపాదించటానికే. మనకు లేనివస్తువు వచ్చేస్తే సుఖపడతామని మనకు అనిపిస్తుంది. ఏదోరావటం వలన నీకు సుఖం వచ్చేయదు. దు:ఖం నుండి విడుదల పొందటానికి నీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఆత్మానుభవం పొందవలసిందే. ఇందులో రాజీలేదు.

నీవు ఆత్మవు. నీకు ఆత్మగురించి తెలియటంలేదు అంటే నీగురించి నీకు తెలియటంలేదు అని అర్ధం. ఆత్మనీకు వేరుగాలేదు. నీలోనేఉంది. నీలోఉండటం ఏమిటి అదినీవే. ఆత్మను ఎలా తెలుసుకోవాలి అంటున్నావు నీవుఅడిగే ప్రశ్నఎలాఉంది అంటే రమణాశ్రమంలో కూర్చొని రమణాశ్రమంకు ఎలావెళ్ళాలి అని అడిగితే ఎలాఉంటుందో నీవు అడిగే ప్రశ్న అలా ఉంది అంటున్నారు. నీవు ఆత్మను తెలుసుకోనక్కరలేదు. నీవు ఆత్మవే. దానికి సంబంధించిన అనుభవం నీకు లేదు. ఈశరీరమే నేను అనే తలంపు నశిస్తే ఉన్నవస్తువు ఉన్నట్లుగా తనంతట తానుగా నీకు వ్యక్తమవుతుంది. ఆత్మచింతన

తప్పించి ఇతరచింతనలు కొంచెము కూడా పుట్టకుండా నిరంతరము ఆత్మనే చింతిస్తూ ఉంటే అది నీకు తెలియకుండా ఎలా ఉంటుంది.

ప్రపంచంలో చాలా మంది అజ్ఞానంలో ఉన్నారు అంటున్నారు. వారి గొడవ నీకు ఎందుకు? ఇదొక మాయ. ఎవరికో అజ్ఞానం ఉంటే నీకు ఎందుకు? నీలో అజ్ఞానం ఉందేమో ముందు చూసుకో. నీలో అజ్ఞానం ఉంటే దానిలో నుండి బయటకురా. అజ్ఞానము నుండి బయటకు రావాలంటే ఆత్మజ్ఞానమును సంపాదించి తీరవలసిందే. అహంకారమును ఆత్మలో ఎలా లీనం చేయాలి అంటున్నారు. అది అసలు ఉంటే కదా లీనం చేయటానికి అంటున్నారు భగవాన్. అది ఉంది అని నీవు అనుకొంటున్నావు. నిజంగా అదిలేదు. ఆహంకారము నిజంగా ఉంటే నీవు పూజచేసినా, జపం చేసినా విచారణ చేసినా అదిపోదు అహంకారం నిజంకాదు కాబట్టి విచారణ చేస్తే అది పోతుంది. అహంకారముఎక్కువగా ఉన్నవాడికి భయం ఎక్కువగా ఉంటుంది. అహంకారముపోయేవరకు భయం విడిచిపెట్టదు. ఎంతకాలం భయం ఉంటుందో అంతకాలం దు:ఖం మానవుడిని విడిచిపెట్టదు. అహంకారము నేను అనుకొని దానితో తాదాప్యం పొందుతున్నావు. అదినీవు కాదు అని నీకు తెలిస్తే దానితో తాదాప్యం పొందవు. ఎప్పడైతే తాదాప్యం వదిలిపెట్టావో అది కృశించి నశిస్తుంది. అహంకారము వలన ప్రమాదము ఏమిటి అంటే దానికి రూపము లేదుగాని ఎప్పుడు ఏదో రూపమును పట్టుకొని ఉంటుంది, రూపాలను మారుస్తుంది. గురువు యొక్క అనుగ్రహంవలన అది నీవు కాదు అన్న సంగతి నెమ్మది, నెమ్మదిగా నీకు తెలుస్తుంది.

నేను దేహాన్ని అనుకొన్నప్పడు నీకు ప్రపంచం కనిపిస్తుంది. నీకు దేహబుద్ధి లేనప్పడు ప్రపంచం నీకు వేరుగా కనబడదు. అంతా నీవే. నేను దేహాన్ని అనుకొన్నప్పడు దేహం వేరు, ప్రపంచం వేరు. దేహంలోపల నేను ఉన్నాను నాకు బయట ప్రపంచంఉంది అనిపిస్తుంది. దేహబుద్ధి ఎప్పడైతే నశించిందో అంతా నీవే అన్న సంగతి నీకు తెలుస్తుంది. అప్పడు అంతా శాంతే. ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా ఆనందమే. ప్రపంచం అంతా నీవే అన్న సంగతి నీకు తెలిసినపుడు నీకు రసానుభూతి కలుగుతుంది. దానిని ఎవరు వర్ణించగలరు. నీవు ఆత్మవు అని గ్రహించినపుడు నీకు భిన్నంగా ఎవరూలేరు. నీకు భిన్నంగా ఎవరూ లేనప్పడు భయంలేదు, అసూయలేదు, బేధంలేదు. అంతా ఆత్మగానే కనిపిస్తుంది. ఉన్నది అదే. అన్ని శాస్త్రములు, అన్ని మతములు, గురువులు చెప్పేది ఏమిటి అంటే అహంకారము అనేదిలేదు. అది ఉందని నీవు అనుకొంటున్నావు. అందువలన తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అప్పడు నీ హృదయంలో ఉన్న సుఖము, శాంతి పొంగి నీసహస్రారానికి అందుతుంది. ఇప్పడు మనస్సు వేరు, దేహము వేరు, బుద్ధి వేరు అని నీవు అనుకొంటున్నావు. సుఖసముద్రం పొంగివచ్చినప్పడు అన్నీ కలిసిపోతాయి. వరదవచ్చినప్పడు మెరక, పల్లం అని ఏమీ ఉండదు. అంతా మునిగిపోతుంది. అలాగే శాంతి ప్రవాహము వచ్చినప్పడు నీదేహము, మనస్సు, బుద్ధి అన్నీ ఒకటైపోతాయి. ఇప్పడు మీరు కష్టపడి పూజలు చేస్తున్నారు, జపాలు చేస్తున్నారు, ధ్యానాలు చేస్తున్నారు. వీటికి ఫలం వస్తుంది. అది ఏమిటి అంటే ఇప్పడు ఏదైతే మీరు ఉంది అనుకొంటున్నారో అది లేదు అని మీకు తెలుస్తుంది. అదే మీరుచేసే సాధనకు ఫలం.

కొంతమంది సక్రమంగా ఆలోచించలేరు. ప్రతీది నెగిటివ్‌గా ఆలోచిస్తారు వారికి దు:ఖం ఎక్కువ ఉంటుంది. మనం సక్రమంగా ఆలోచించటం నేర్చుకోవాలి. మనం సక్రమంగా ఆలోచించటం వలన

మన మనస్సు నిర్మలంగా ఉంటుంది, శాంతిగా ఉంటుంది. ఉన్నది ఒక్కటే. దానిని తెలుసుకొంటే సుఖం, తెలియకపోతే దుఃఖం. బాహ్యమైన వస్తువులను డబ్బుపెట్టి కొనుక్కొన్నట్లు దానిని బజారులో మనం కొనలేము. నీకు చాలా సంపదలు ఉన్నాయి అనుకో. ఈ సంపదలు అన్నీ నీకు ఇచ్చేస్తాను ఆత్మస్థితిని, మోక్షస్థితిని నాకు ఇయ్యి అని అంటే భగవంతుడు ఇవ్వడు. ఎందుచేతనంటే దానికి, దీనికి పోలికలేదు. ఆత్మస్థితినిజం, నీసంపదలు అన్నీ అనిజం. అందువలన అనిజాన్ని తీసుకొని నిజాన్ని ఇవ్వడు. బాహ్యంగా నీకు ఉన్న డబ్బుతోగాని, సంపదలతో గాని, కీర్తితోగాని, మరి ఏఇతరపదార్థములతో గాని దానిని పొందలేవు. నీవు ప్రయత్నం చేసి సూక్ష్మబుద్ధిని సంపాదించుకొని గురువును ఆశ్రయించి మోక్షస్థితిని పొందాలి గాని బాహ్యపదార్థములతో పొందేదికాదు అని చెపుతున్నారు. మాయ మాటలు చెపితే మీరు బోల్తా పడతారని ముందుజాగ్రత్తకోసం ఈ మాటలు అన్నీ చెపుతున్నారు. ఎవరైనా మాయమాటలు చెపుతారు అనుకోండి. వారిమీద విరోధం పెట్టుకోకూడదు. ఉదాసీనంగా ఉండాలి. వారి వలలో మనం పడకూడదు. ఉన్నది ఒక్కటే, అయితే ఈ గొడవ అంతా ఎందుకు అంటున్నారు. ఈగొడవకూడా ఆయనే అనుకొంటే ఏమీలేదు.

ప్రతీ చిన్న విషయానికి మనస్సును పుండుచేసుకోవద్దు. మనస్సు ఆరోగ్యంగా ఉంటే, మనస్సు భగవంతుని చింతిస్తూ ఉంటే మనస్సు కరిగిపోతుంది. మానసిక ఆరోగ్యము మనస్సు కరగటానికి సహకరిస్తుంది. జీవితంలో అన్నీ మనం అనుకొన్నట్లు జరగవు. మనం అనుకొన్నట్లు జరిగినంత మాత్రంచేత పొంగిపోకండి, అనుకొన్నట్లు జరగకపోతే కృంగిపోవద్దు. వీటివలన అహంకారం పెరుగుతుంది. అందువలన మీ దేహాన్ని ప్రారబ్ధమునకు విడిచిపెట్టి మీరు వచ్చినపని చూసుకోండి అనేవారు భగవాన్. ఎప్పుడూ జపం, ధ్యానం చేయటమేనా ఇలా ఎంతకాలం జపం, ధ్యానం చేయాలి అని అడుగుతున్నారు. భగవంతుడికి భిన్నంగా నీ స్వరూపానికి భిన్నంగా నీ మనస్సు ఎంతకాలమైతే వ్యక్తమవుతోందో అంతకాలము నీవు జపం, ధ్యానం, విచారణ చేయవలసిందే. ఇది వెళ్ళి అందులో కరిగే వరకూ నీవు సాధన చేయవలసిందే. సాధన చేసేటప్పుడు ఎవడూ సుఖం ఉండడు. ఎందుచేతనంటే అది నిజంకాదు కాబట్టి వాడు సుఖంగా ఉండడు. ప్రయత్నం అవసరమే ఎంత వరకు అంటే ప్రయత్నం లేని స్థితికి ఎదిగే వరకూ ప్రయత్నం అవసరమే.

**12-12-97 వ తేదీన దీపోత్సవం**

**ఐ భీమవరంలో జరుపబడును.**

**13-1-98 వ తేదీన శ్రీరమణ జయంతి**

**జిన్నూరు శ్రీరమణక్షేత్రంలో జరుపబడును.**